# క్రాపింగ్



[ఇది నిజానికి మా అన్నయ్య క్రాపింగ్ కథయే లెండి. కథరాసే ఓపిక వాడికి లేదు. అందుకని వాడు చెప్పే మాటలనన్నిటినీ కథగా కూర్చి నేనే వ్రాసాను.]

మా అమ్మ చెప్పటాన్నిబట్టి నాకు చిన్నప్పుడు చక్కటి జడ ఉండేదని తెలిసింది. అయిదో సంవత్సరంలో మా మేనమామ వచ్చి, అది కత్తిరించేయడంతో నా తలమీద క్రాపింగుకథ మొదలైంది. అంత చక్కటి జడ వున్నట్టుండి పోయినందుకు మా అమ్మకు చాలా విచారం వేసిందిట. పోనీ వీడుఆడపిల్లయినా అయి ఉండకూడదా అనుకునేదిట!

నాకు ఏడేళ్లు వచ్చినప్పటినుంచీ నా క్రాపింగుకూ నాకు మధ్య జరిగిన యుద్ధం, దానిద్వారా మా తల్లితండ్రులకూ నాకు మధ్య జరిగిన యుద్ధం బాగా గుర్తున్నది. స్వతహాగా నా జుట్టు ఏపుగా త్వరగా పెరిగేది. నెల అవకండానే దట్టంగా పెరిగి పోగయ్యేది. దానితోటి జుట్టు నుదురుమీద పడటం, అది పైకి తీసుకోటానికి తల ఎగరేయటం మామూలైపోయింది. నేను తల ఎగరేసినప్పుడు, మా నాన్నగాని, అమ్మ గానీ చూశారా - చీవాట్లు తగిలాయన్నమాటే!

మాకు నెల నెల క్షవరం చేయటానికి ఒక లావుపాటిమంగలి వస్తుండేవాడు. వాడు ఒక అణాకి [ఆ రోజుల్లో మేమిచ్చే దంతేలెండి] నాతో పడరానిపాట్లుపడి, గట్టిగా బలవంతంగా కూచోపెట్టి మిషను పెట్టి కత్తిరించేసేవాడు. వాడికి వక పట్టాన్ని లొంగేవాణ్ణి కాదు. మా ఇంటిచుట్టూ పదిమాట్లు పరిగెత్తించేవాణ్ణి. ఆఖరికి పెద్దవాడు కాబట్టి నన్ను పట్టుకొని క్షవరం చేసేవాడు.

శ్రీమతి చె. అచ్యుత[illegible]

కష్టపడి నెల రోజులు పెంచిన ఆ వల్లటి వెంట్రుకలు గుప్పెడు గుప్పెడు తెగి పడిపోతోంటే నాకు కళ్ళమ్మట నీళ్లు గిర్రున తిరిగేవి. అసలే జుట్టు తగ్గిపోతోందని నేను ఏడుస్తుంటే, మా నాన్నగారు "ఒరే వెంకడూ, ఈవెధవకి మళ్ళీ మూడు నెలలవరకు జుట్టు పెరక్కుండా శుభ్రంగా పలాచగా చెక్కెయ్యరా నాయనా" అని వాడిని గదమాయించేవాడు. దాంతో నాకు వొళ్లు మండుకుపోయేది.

"ఒరేయ్ నేను చెప్పినట్లు కత్తిరించేవా సరే! లేకపోతే నిన్ను మళ్లా ముప్పతిప్పలూపెట్టి, మూడు చెరువులనీరు త్రాగిస్తా" అనేసరికి, వెంకడు "బాబ్బాబు! మీ ఇష్టం వచ్చినట్లే కత్తిరిస్తా గదూ" అని ప్రాధేయపడేవాడు.

ఆ మిషను ఆడుతున్నంతసేపు వకటే మంట! వాణ్ణి సాచిపెట్టి, ఒక్క లెంపకాయ కొడదా మనిపించేది. కాని, వాడు మళ్లీ కొడతాడేమో అని భయం వేసేది. క్షవరం అంతట్లోకీ, చాలా సరదాగా వుండే ఘట్టం - ఆఖరున మంగలాడు కత్తి నూరి, నెమ్మదిగా దవడలమీద చెవుల వెనకా గీకటం. నాకుఅక్కడ కత్తి తగలగానే గిలిగింతలు పెట్టినట్టుండేది. అంతదాక ఏడుపు ముఖంతో ఉన్నవాణ్ణి కూడా, గభుక్కున నవ్వేసేవాడిని.

ఇక క్షవరం పూర్తి అయి, తలంటి పోసుకున్నాక వక గంటసేపు క్రాపుకీ నాకు కుస్తీ జరిగేది. నాయనగారి ఆజ్ఞప్రకారం మంగలాడు అంటకత్తిరి వేసేవాడు. ఎంత కష్టపడి దువ్వినా ఆ వెంట్రుకలు అణిగేవికావు. నాకు కుడిప్రక్కన సుడి వకటుండేది. దానిమూలంగానూ, పాపిడి ఎడంపక్క తీసే అలవాటు వున్నందువల్లనూ సుడిదగ్గర వలయాకారంగా వెంట్రుకలునిక్కపొడుచుకొని నిలుచుండేవి. నీళ్లు పోసి దువ్వేవాడిని. దువ్వెన నీళ్లల్లో ముంచి దువ్వేవాడిని. నూనె రాసేవాణ్ణి. ఏమి చేసినా కుడిప్రక్క

## ★ నా క్రాపింగ్ ★

సుడిదగ్గరమట్టుకు వెంట్రుకలు ఎంతమాత్రం లొంగేవికావు. ఇంక కాస్సేపటికి చేతులు నొప్పిపెట్టి, దువ్వటం మానివేసేవాడిని. అద్దంలో నా క్రాపు, నా ముఖం చూచుకుంటే నాకే ఏడుపొచ్చేది!

ఒకరోజు మా పిన్ని వచ్చింది. నేను నా క్రాపింగుతో పడే అవస్థ చూచి "ఒరే రామూ, సుడి ఆ ప్రక్కన ఉందికదా? పాపిడి కూడా కుడిప్రక్క సుడిలోకే తీస్తే, వెంట్రుకలు వచ్చినట్లు లొంగుతాయిరా" అంది. భలే ఆలోచన! వెధవది నాకిన్ని నెలలు, సంవత్సరాలు గడిచినా తట్టనేలేదు! మరి యీవిడకి ఎలా తోచిందో? పాపిడి కుడి ప్రక్కకు మార్చాను; ఒకటి రెండు రోజులు కష్టపడ్డాక నెమ్మదిగా దారిలోకి వచ్చింది.

కాని కుడి పాపిడితో క్లాసులో అడుగు పెట్టానో లేదో, మా జతగాళ్ళంతా "ఏరోయ్ హిట్లరు క్రాపింగు తీసేవ్" అన్నారు.

ఆ మర్నాటినుండి కుడిప్రక్క వెంట్రుకలు నుదుటిమీద పడేలా దువ్వి క్లాసుకు వచ్చాను. "నీకు ఫ్రెంచికట్ మీసమే తక్కువయిందిరా" అన్నారు. అప్పటినుంచీ కుడి ప్రక్క పాపిడే అలవాటై మా పిన్నిని ఎంతో పొగిడాను.

చిన్నప్పుడు క్షవరం చేసుకోవడం అంటేవుండే భయం. పెద్దయ్యాక బద్ధకంగా మారింది. ఒకమారు హాస్టల్లో మూడు నెలలు వరుసగా క్షవరం చేసుకోవటం మానేశాను. జుట్టు బాగా చెవులమీదకి పెరిగిపోయింది. ఇక మా హాస్టల్ విద్యార్థులు నా క్రాపింగు చూడలేక, వాళ్లు తలా ఒక కానీ చందా వేసుకొని, మంగల్ని పిలిపించి క్షవరం చేయించారు. 'పోనీ ఆరణాలు మిగిలినా మిగులేలే' అనుకొని ఆరోజు సాయంత్రమే ఆ ఆరు అణాలూ హోటల్లో చెల్లించేశాను.



కానీ ఎప్పుడు అద్దంలో చూసుకొన్నా, నా క్రాపింగు నాకెప్పుడూ సంతృప్తికరంగా కనపడేది కాదు. ఇలా ఉండగా మా గ్రూపులో ఒకమాటు "క్లాసులోకంతావున్నతమయిన క్రాపింగు ఎవరిది?" అని తర్కించుకున్నాం. చెపుతే నమ్ముతారో నమ్మరో లేదో కానీ— "రాముగాడిదే ఫస్టు" అన్నారు అంతా!

నేను మొదట హేళన చేస్తున్నారేమో అనుకున్నాను. తరువాత వాళ్ల సీరియస్ ముఖాలు చూసి, వాళ్లు నాకిచ్చిన గౌరవం స్వీకరించాల్సి వచ్చింది. ఈ నా క్రాపింగు మార్పుకి కారణం ఏమిటై వుంటుందంటారు?

నా క్రాపింగు బాగా లేదనే ఘట్టి నమ్మకంతో నేను ప్రతిరోజూ దాన్ని గురించి తీసుకున్న ఆ అపరిమితమైన శ్రద్ధే! ★